ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024



నేవీ రిహార్సల్స్ అదరహో అనిపించాయి. కమాండర్ల విన్యాసాలను తిలకించేందుకు సందర్శకులు ఆదివారం తీరానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు.
- 7లో

ఏయూలో ఏం జరుగుతోంది?

టీడీఆర్ హబ్ అక్రమాలపై విచారణకు కమిటీని నియమించిన ఇన్‌చార్జి వీసీ

- నివేదిక సమర్పించినా గోప్యత
- తాజాగా కాలేజీల ప్రినిపాళ్లకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశం

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్ వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ప్రొఫెసర్ మల్లికార్జున నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించారు. ఈ కమిటీ అనేక అంశాలను పరిశీలించి, నివేదికను సమర్పించింది. అయితే ఆ వివరాలను ఇప్పటికీ అధికారులు వెల్లడించ లేదు. దీనిపై సీనియర్ ప్రొఫెసర్లు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.

ఇదిలా ఉండగా టీడీఆర్ హబ్‌లో ప్రవేశా లు పొందిన వారికి ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు అందినట్టు తెలిసింది. దీనిపై పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. విచారణ నివేదిక వివరాలు వెల్లడించి, అనుమానాలను నివృత్తి చేసిన తరువాత పరీక్షలు నిర్వహిస్తే మేలనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే కొందరు ప్రిన్సిపాళ్లు ప్రీ పీహెచ్‌డీ పరీక్షల నిర్వహణకు వీలుగా కాలేజీ రీసెర్చ్ కమిటీ (సీఆర్‌సీ) సమావేశాలు నిర్వహించి ప్రక్రియను కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. తాజాగా ఈ వ్యవహారం వర్సిటీలో వివాదం రాజేస్తోంది. దీంతో కొంతమంది మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.



తీరంలో కళా సోయగం

గజ్జెల సవ్వడితో తీరం మార్మోగింది. వేలాదిమంది కళాకారుల నృత్య ప్రదర్శనతో ఆహూతుల హృదయం పులకించింది. కూచిపూడి నాట్య పతాక 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నటరాజ్ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ సారథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 1,800 మంది కళాకారులు చేసిన బ్రహ్మాంజలి మహా బృంద నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది. తీరంలోని లైట్‌హౌస్ పక్కనున్న ఎంజీఎం పార్కు మైదానంలో నిర్వహించిన గ్రాండ్ ఫినాలే నగరవాసులకు సరికొత్త అనుభూతిని అందించింది. - 6లో

ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

వైద్యులు, సిబ్బంది కొరతతో సేవలపై ప్రభావం

- ఉమ్మడి జిల్లాలో 38 ఆయుష్ డిస్పెన్సరీలు
- సగానికిపైగా కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ
- అధ్వాన స్థితిలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం
- కుర్చీలు కూడా లేని దుస్థితి

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

ప్రజలకు ప్రాచీన, సంప్రదాయ వైద్యాన్ని అందించేందుకు నెలకొల్పిన ఆయుష్ డిస్పెన్సరీలను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఖాళీల భర్తీకి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలందని పరిస్థితి నెలకొంది. ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య పద్ధతులను కలిపి ఆయుష్‌గా పేర్కొంటారు. ఉమ్మడి జిల్లాలో 38 ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో అనేకచోట్ల రోగులను పరీక్షించి, సమస్యను గుర్తించేందుకు వైద్యులు లేరు. కొన్నిచోట్ల అటెండర్లు లేకపోవడంతో మందులు అందించడం నుంచి అన్ని పనులూ వైద్యులే చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.


విశాఖలోని ఆయుష్ ఆర్డీడీ కార్యాలయం


కేజీహెచ్‌లోని ఆయుర్వేద ఆస్పత్రి

విశాఖలో కాస్త మెరుగు

విశాఖ జిల్లాల్లో ఐదు ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా ఒక్క నగరంలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, కేజీహెచ్‌లోని డిస్పెన్సరీల్లో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన నాలుగుచోట్ల మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. హోమియోకు సంబంధించి ఐదు డిస్పెన్సరీలు ఉండగా, 15 పోస్టులకు గాను ఆరు ఖాళీలు ఉన్నాయి. ప్రసాద్ గార్డెన్స్‌లోని డిస్పెన్సరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, వేపగుంటలో కాంపౌండర్ పోస్టు, మిందిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, అగనంపూడిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో రెండు యునాని డిస్పెన్సరీలు ఉండగా, రెల్లివీధిలో కాంపౌండర్ పోస్టు, భీమునిపట్నంలో కాంపౌండర్, ఏఎన్ఎం, ఎఫ్ఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అధ్వానంగా ఆర్‌డీడీ కార్యాలయం

మధురవాడలో 1987లో ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. ఆరు జిల్లాలను పర్యవేక్షించే కార్యాలయం ఒక చిన్న గదిలో నడుస్తోంది. అక్కడ కూర్చునేందుకు సరైన కుర్చీలు, ఫైళ్లు భద్రం చేసేందుకు బీరువాలు, కంప్యూటర్లు లేవు. దీనిపై ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదని చెబుతున్నారు.

అల్లూరి జిల్లాలో...

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆయుర్వేద విభాగానికి సంబంధించి నాలుగు డిస్పెన్సరీలు ... మిగతా 6వ పేజీలో

37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

ఒక వార్డర్ సస్పెన్షన్

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే క్షమించేది లేదు
- ఉత్తరాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్


జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

విశాఖ కేంద్ర కారాగారంలో శనివారం రాత్రి ధర్నా చేసిన ఘటనలో 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు ఉత్తరాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ తెలిపారు. సెంట్రల్ జైలులో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా పోలీసు, జైళ్ల శాఖలో పనిచేసే ఉద్యోగులెవరూ ధర్నాలు, నిరసనలు తెలపకూడదని నిబంధనలున్నాయన్నారు. అయితే విశాఖ సెంట్రల్ జైలులో వార్డర్స్ నియమావళికి వ్యతిరేకంగా, ఇతర సిబ్బంది విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించారన్నారు. ఈ నేపథ్యంలో ధర్నా చేసిన 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, వారిని రాష్ట్రంలోని వివిధ జైళ్లకు అటాచ్‌మెంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్టు ప్రకటించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని, ధర్నాలు, నిరసనలకు దిగకూడదన్నారు. ఏకంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగడం క్షమార్హం కాదన్నారు. వార్డర్ వాసుదేవరావును సస్పెండ్ చేయడంతో పాటు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిబ్బందిలో కనిపించని క్రమశిక్షణ

కేంద్ర కారాగారం సిబ్బందిలో క్రమశిక్షణ లేకపోవడాన్ని గమనించామని డీఐజీ తెలిపారు. తప్పుచేసిన వార్డర్ వాసుదేవరావును ప్రత్యేక గదిలోకి తీసుకువెళ్లి తనిఖీ చేయడం నేరం ... మిగతా 6వ పేజీలో

గోడు పట్టదా!

స్మార్ట్‌టౌన్‌షిప్‌నకు భూములిచ్చిన రైతుల గగ్గోలు

- వీఎంఆర్‌డీఏ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- సమీకరించిన భూముల్లో తోటలు తొలగింపు
- జీడి పిక్కల ఫలసాయం కోల్పోయిన రైతులు
- ఎకరాకు 1200 గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిక


స్మార్ట్‌టౌన్‌షిప్‌కు సమీకరించిన తోటలు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు భూములు ఇచ్చిన రైతులను వీఎంఆర్డీఏ పూర్తిగా విస్మరించింది. భూములు సమీకరించి మూడేళ్లు దాటినా ఇంతవరకు రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వలేదు. అంతేకాదు ప్లాట్ల అభివృద్ధి పేరుతో ఫలసాయం అందించే జీడితోటలు తొలగించడంతో ఏటా వచ్చే ఆదాయం కోల్పోయామని రైతులు మండిపడుతున్నారు. డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల మంజూరుకు గత ఏడాది వైసీపీ ప్రభుత్వం జీవో జారీచేసిందని, స్మార్ట్‌టౌన్‌షిప్‌కు భూములు ఇవ్వడంతో వాటిని కోల్పోయామని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎకరాకు 1,200 గజాలు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

నగరంలో మధ్యతరగతి వర్గాల వారికి తక్కువ ధరకు 150, 200, 250 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్లను విక్రయించాలని గత పాలకులు ప్రతిపాదించారు. ప్రైవేటు లేఅవుట్‌లలో ధరలు అధికంగా ఉంటాయని, మౌలికవసతుల కల్పన ఉండదని, ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారం, పాలవలసలో 2021 డిసెంబరు 27, 28న సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి 363 ఎకరాలను సమీకరించారు. ఇందులో డి పట్టాభూములు 306 ఎకరాలు, రైతుల ఆక్రమణలో ఉన్నవి 18 ఎకరాలు, గెడ్డలు, వాగులు, ఇతర ప్రభుత్వ భూములు సుమారు 40 ఎకరాలు న్నాయి. రామవరంలో 40 మంది రైతుల నుంచి 130 ఎకరాలు, గంగసాని అగ్రహారానికి చెందిన 70 మంది నుంచి 140 ఎకరాలు, పాలవలసలో 35 మంది నుంచి 90 ఎకరాలు సమీకరణకు రైతులు సమ్మతించారు. ఆ తరువాత రామవరంలో 20 ఎకరాలను ఇందులోంచి తప్పించారు. డీపట్టా ఇచ్చిన రైతుకు ఎకరాకు 900 గజాల అభివృద్ధిచేసిన ప్లాటు ఇస్తామని అధికారులు ప్రకటించారు. వీఎంఆర్‌డీఏ నిబంధనల మేరకు ఎకరాకు 2,600 గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లు వస్తాయని, అందులో రైతులకు 900 గజాలు ఇవ్వగా 1,700 గజాలు మిగులుతుందన్నారు. వీఎంఆర్‌డీఏ స్థలాన్ని మూడు వర్గాలుగా విభజించి విక్రయించాలని ప్రతిపాదించి ... మిగతా 6వ పేజీలో

నగరంలో పేకాట డెన్‌లు!

న్యూఇయర్, సంక్రాంతి నేపథ్యంలో పెరిగిన జోరు

- వేదికలుగా లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లు
- అక్కడే మద్యం, ఆహారం అందిస్తున్న నిర్వాహకులు
- పోలీసులతో ముందస్తు అవగాహన
- సీపీ దృష్టిసారించాలంటున్న నగర వాసులు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పేకాట రాయుళ్లలో కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ జోష్ కనిపిస్తోంది. నగరంలోని కొంతమంది నిర్వాహకుల అవతారమెత్తి పేకాటకు ఆహ్వానిస్తున్నారు. నగరం నడిబొడ్డున హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల్లో గదులు అద్దెకు తీసుకుని పేకాట ఆడిస్తున్నారు. ఆ పరిధి పోలీసులను ముందుగానే ప్రసన్నం చేసుకోవడంతో దాడులు జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా పేకాటరాయుళ్లకు సమయానికి తాకట్టు సదుపాయంతోపాటు మద్యం, ఆహారం అందించి మరీ ప్రోత్సహిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సంక్రాంతి నాటికి నగరంలో జూదం తారాస్థాయికి చేరుతుందంటున్నారు.

ఏటా సంక్రాంతి పండగ సమయంలో పేకాట సాగడం రివాజు. దీనికి నగరశివారులోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, తోటలు వేదికలుగా నిలిచేవి. కానీ ప్రస్తుతం శివారు ప్రాంతాలకు వెళ్లిరావడానికి సమయం వృథా అని భావిస్తున్న కొంతమంది నగరం నడిబొడ్డునే ... మిగతా 6వ పేజీలో

'ఉపాధి' నిధులతో పల్లెల్లో సీసీ రోడ్లు

రూ.16 కోట్లతో 136 రోడ్లకు ఆమోదం

- ఇప్పటికే 47 పూర్తి: రూ.2.9 కోట్ల చెల్లింపు
- సంక్రాంతి నాటికి మొత్తం పనుల పూర్తికి ప్రణాళిక


పెందుర్తిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో 136 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఆనందపురం మండలంలో 19, భీమిలి మండలంలో 20, పద్మనాభంమండలంలో 26, పెందుర్తి మండలంలో 71 రోడ్ల నిర్మాణాలకు జిల్లా యంత్రాంగం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గ్రామస్థాయిలో పనులను స్థానికులకు అప్పగించారు. వచ్చే సంక్రాంతికి ముందే రోడ్డు నిర్మాణాలు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంజూరైన 136 రోడ్లలలో 130 రోడ్ల పనులు ప్రారంభించగా పెందుర్తిలోనే 38,భీములిలో ఎనిమిది, ఆనందపురంలో ఒక రోడ్డు వెరసి 47 రోడ్లు ఇప్పటికే పూర్తిచేశారు. గ్రామాల్లో ప్రజలను అనువుగా ఉన్న రోడ్లకు గుర్తించారు. ప్రధాన రహదారుల నుంచి గ్రామం వరకు. గ్రామాల్లో శ్మశానాలు, చెరువులు, కొండ ప్రాంతాలకు వెళ్లే రహదారులను సిమెంట్ రోడ్లగా అభివృద్ధి చేస్తున్నామని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. ప్రారంభించిన రోడ్లు వచ్చేనెల 15 కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

కిమ్స్ ఐకాన్, ఎంజీ కేన్సర్ ఆస్పత్రులకు నోటీసులు

ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదుతో చర్యలు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలోని రెండు ఆస్పత్రులకు వీఎంఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీచేశారు. ఎన్ఆర్ఐ కోటాలో ఆస్పత్రుల నిర్మాణానికి భూములు తీసుకుని నిబంధనల మేరకు నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించని ఎంవీపీలోని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, గురుద్వార జంక్షన్ సమీపంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. 1990లో ఆస్పత్రి నిర్మాణానికి ఎన్ఆర్ఐ కోటాలో భూమిని కేటాయించారు. ఈ స్థలంలో ఆస్పత్రి నిర్మించాలని, పది నుంచి 20 శాతం నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. రెండేళ్లలోపు పూర్తి చేయాలని, 15 ఏళ్లలోపు యాజమాన్య హక్కులు బదలాయించకూడదన్న నిబంధనలతో భూమిని ఇచ్చారు. అయితే, ఎన్ఆర్ఐ ఆస్పత్రిని మూడు నెలల కిందట కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి విక్రయించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 300 పడకలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నిబంధనల మేరకు 60 పడకలను నిరుపేద రోగులకు కేటాయించి, ఉచితంగా వైద్య సేవలు అందించాలి. ఈ ఆస్పత్రిలో నిబంధనలు పాటించడం లేదని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు వీఎంఆర్‌డీఏ అధికారులకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన అధికారులు ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులను పంపించారు. దీనిపై ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 1990లో ఎన్ఆర్ఐ కోటా కింద గతంలో ఆస్పత్రి నిర్మాణానికి భూమిని కేటాయించారు. ఇదే రీతిలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి కూడా సేవలను అందించడం లేదని గుర్తించిన అధికారులు ఆ యాజమాన్యానికి నోటీసులిచ్చారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ హెచ్చరించారు.



వీధి లైట్లు లేకపోవడంతో రోడ్డు మీదకు వచ్చిన అడవి పంది

వీధి లైట్లు వెలగక అవస్థలు

విశాలాక్షినగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ కాలనీ, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో లైట్లు లేకపోవడంతో రాత్రివేళ అడవి పందులు, ముళ్ల పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలనీ వెనుక వైపు ఉన్న కొండ నుంచి అవి రోడ్డు మీదకు వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు.

గోదాదేవికి ధనుర్మాస పూజలు



సింహాచలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. షోడశోపచార పూజలు తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్ఛారణల నడుమ బేడా మండప తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారి సన్నిధానంలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 14 పాశురాన్ని విన్నవించారు. ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే కొండదిగువ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి షోడశోపచారాలు సమర్పించిన తరువాత తిరుప్పావై పాశురాన్ని విన్నవించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఎండాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన గోపి, ఒమ్మి బాబూరావు, పరమేశ్వరరావు, మంగాదేవి, దొరబాబు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

4వ వార్డులో...

భీమునిపట్నం : జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. వార్డు పార్టీ అధ్యక్షుడు పాసి నరసింగరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సూరాడ రవి ఆదివారం బూత్‌ల వారీగా ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

పద్మనాభం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేట, విజయానందపురం గ్రామాల్లోని సత్యసాయి బాల వికాస్ విద్యా కేంద్రాల విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.రెడ్డిపల్లి భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో రెండు కేంద్రాల్లో 50 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు.



భీమిలి తీరంలో సందర్శకులు



పర్యాటకులతో సందడిగా రుషికొండ బీచ్

తీరంలో పర్యాటక సందడి

భీమిలి, రుషికొండ తీరాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా వేలాది మంది తరలివచ్చారు. వారం రోజులుగా వర్షాలు, చల్లని గాలుల వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. గత రెండు రోజులుగా వాతావరణం మారడంతో పర్యాటకులు బీచ్‌లకు తరలివచ్చారు. కొబ్బరితోట పార్క్, రామాద్రి బీచ్, రుషికొండ ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి. కొందరు సముద్ర స్నానాలు చేస్తూ.. మరికొందరు బోటు షికారు చేస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీచ్‌లతో సందడిగా గడిపారు.

- భీమునిపట్నం, సాగర్‌నగర్

అప్పన్నను దర్శించుకున్న సినీ గాయకుడు కారుణ్య



సంకీర్తనలు ఆలపిస్తున్న కారుణ్య

సింహాచలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి టాలీవుడ్ నేపథ్య గాయకుడు కారుణ్య భక్తితో సంకీర్తనల నీరాజనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసు కున్న కారుణ్య గోత్ర నామాలతో అర్చకులు అంతరాలయంలో అష్టోత్తర శత నామార్చనలు జరిపారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, ఏఈఓ ఆనందకుమార్ ప్రసాదాలు అందజేశారు. తరువాత ఆయన ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరుల ముందు అనేక భక్తి సంకీర్తనలతో నీరాజనాలిచ్చారు.

పని చేయని ఈ-టాయిలెట్లు



తెన్నేటీ పార్కు, కైలాసగిరిపై పని చేయని ఈ-టాయిలెట్లు

విశాలాక్షినగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతాల్లో ఈ-టాయిలెట్లు పనిచేయకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీఎంఆర్‌డీఏ తెన్నేటీ పార్కు, కైలాసగిరి తదితర పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల సౌకర్యార్థం ఈ టాయిలెట్లు అందుబాటులో ఉంచింది. నిర్వహణ లోపం వల్ల కొద్ది రోజుల్లోనే ఇవి మూలకు చేరాయి. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో ఆయా ప్రాంతాలకు వస్తున్న సందర్శకులు టాయిలెట్లు పని చేయక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పలు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



గెద్దపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభోద సేవా సమితి సభ్యులు

పద్మనాభం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినాడ, గెద్దపేట గ్రామాల్లో ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కె. త్రినాథరావు, సభ్యులు కృష్ణసూరప్పడు, పైడన్న, సంతోష్, లక్ష్మి, రాజు, సత్యం, శ్యామ్ పాల్గొన్నారు.

'శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకుంటాం'



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న సందీప్

భీమునిపట్నం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె జీవితం బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఇటుక బట్టీ వ్యాపారి బొట్ట శ్రీనివాసరావు కుటుంబాన్ని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ ఆదివారం పరామర్శించారు. టి. నగరపాలెంలోని మృతుడి స్వగృహానికి వెళ్లి అతని భార్య, కుమార్తెను జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం సందీప్ మాట్లాడుతూ బాధిత కుటుంబం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. అలాగే జిల్లా పోలీసు అధికారులతో కూడా మాట్లాడానన్నారు. ఆయనతో పాటు జనసేన నాయకులు సురేశ్, శివ, వెంకటేష్ ఉన్నారు.

98వ వార్డు బీజేపీ అధ్యక్షుడిగా శ్రీనివాసవర్మ

సింహాచలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు బీజేపీ అధ్యక్షుడిగా సింహాచలం గ్రామానికి చెందిన రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర నోడల్ ఇన్‌చార్జి కేశవ కాంత్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. వార్డు విస్తృత స్థాయి సమావేశంలో వర్మను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నాసిరావు, భీమిలి అసెంబ్లీ కన్వీనర్ కె. రామునాయుడు, బసన అప్పలనాయుడు, రామకృష్ణ యాదవ్ పాల్గొనున్నట్టు తెలిపారు.

భీమిలి అర్బన్ అధ్యక్షుడిగా కొండబాబు

భీమునిపట్నం : భీమిలి అర్బన్, మండల బీజేపీ అధ్యక్షుడిగా ఊళ్ళ కొండబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని గాడు వీధిలో వున్న కార్యాలయంలో 3, 4 వార్డుల అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కొండబాబు అభ్యర్థిత్వాన్ని గరికిన రామారావు ప్రతిపాదించగా, పూసర్ల సాయి సాత్విక్ బలపరిచారు. అలాగే భీమిలి మండల ప్రతినిధిగా కంటుభుక్త సునీతను ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, నాయకులు వి. శ్రీహరి, డి. నాగరాజు, బి. వెంకటరమణ, కె. సునీత, కె.పరిమిళ, పి. విజయ, ఎ. భవానీ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా 'హోమ్ కమింగ్'



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హోమ్ కమింగ్ పేరిట గీతం వర్సిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు జరిగిన కార్యక్రమానికి గీతం విద్యా సంస్థల చైర్మన్, ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గీతం పూర్వ విద్యార్థులు గీతం విజన్ సాధనలో తమ వంతు సహకారం అందించాలన్నారు. అనంతరం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమ్‌రావు విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరించారు. అలాగే ఈఏడాది ప్రముఖ సంస్థల్లో ప్రతిభ చూపుతూ కీలక స్థానాలకు ఎదిగిన పూర్వ విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మందుబాబులకు అడ్డాగా అంగన్‌వాడీ భవనం



భవనం పక్కన ఉన్న గ్లాసులు, తిండి పదార్థాలు, ఖాళీ మద్యం సీసాలు



నిడిగట్టులోని అంగన్‌వాడీ భవనం

భీమునిపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగట్టు అంగన్‌వాడీ భవనం, పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. నాలుగో వార్డు పరిధిలోని జేవీ అగ్రహారం నుంచి నిడిగట్టు వెళ్లే మార్గంలో రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్ వద్ద అంగన్‌వాడీ భవనం నిర్మించారు. ఈ కేంద్రంలో సుమారు 20 మంది చిన్నారులు చదువుతున్నారు. కేంద్రం బయట వున్న వరండాలో రాత్రివేళ మందుబాబులు మద్యం సేవించి పరిసరాలను నాశనం చేస్తున్నారు. భవనం చుట్టూ ఖాళీ మద్యం సీసాలు, మిక్సర్ పొట్లాలు, గ్లాసులు వంటివి పడేస్తున్నారు. దీనికితోడు వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న కుళాయి పైపులు లీకవ్వడంతో పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. పరిసరాలు అధ్వానంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోడు పట్టదా!

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి లేఅవుట్‌లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు వంటి సదుపాయాలు కల్పించే బాధ్యత వీఎంఆర్‌డీఏదే. భూములిచ్చిన రైతులకు ఒక వైపుగా, మిగిలిన వైపు ప్లాట్లు విక్రయిస్తామని జిల్లా అధికారులు వివరించారు.

జీడితోటలు ధ్వంసం

ఇందులో భాగంగా సేకరించిన భూముల్లోని జీడితోటలను తొలగించారు. 2022 జనవరి తరువాత భూములను రెవెన్యూ అధికారులు వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. రామవరం, గంగసాని అగ్రహారంలో జీడితోటల నుంచి రైతులు ఏటా జీడిపిక్కలు సేకరించేవారు. మూడు, నాలుగు ఎకరాల రైతులకు ఏడాదికి రెండున్నర నుంచి మూడు లక్షల ఆదాయం లభించేది. తోటలు తొలగించడంతో మూడేళ్లపాటు ఫలసాయం కోల్పోయారు. కాగా లేఅవుట్‌గా అభివృద్ధి చేసి ప్లాట్లుగా విభజించడంతో అధికారులు విఫలమయ్యారు. అప్పుడప్పుడు వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించడమే మినహా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రెండు నెలల క్రితం రామవరం, గంగసాని అగ్రహారం రైతులు జిల్లా యంత్రాంగాన్ని, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి గోడు వినిపించారు. మూడేళ్లుగా తోటల ఫలసాయం కోల్పోయామన్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది ఉంటే పూర్తి హక్కులు లభించేవన్నారు. అందువల్ల ఎకరాకు 1,200 గజాల ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించకపోతే భూములను తిరిగి స్వాధీనం చేసుకుని తోటలు పెంచుతామని స్పష్టం చేశారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు

రామవరంలో మా తండ్రికి ఇచ్చిన రెండెకరాల డీపట్టా భూమిలో జీడి తోట వేశాం. ఏటా 20నుంచి 25 బస్తాల జీడిపిక్కలు లభించేవి. మూడేళ్లుగా ఆదాయం కోల్పోయాం. తోటలు తొలగించిన అధికారులు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తే విక్రయించే వీలుండేది. అది జరగకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

- అదరపు దేముడుబాబు, రామవరం

కేజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు

మహారాణిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో 50 పడకల సామర్థ్యంతో సెంట్రల్ ఏసీ స్కానింగ్ ఎక్స్‌రే, అనుబంధ మెడికల్ ల్యాబ్‌లతో కొత్త కాజువాలిటీ విభాగం ఏర్పాటు చేయనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వెల్లడించారు. ఆర్ఎంఓ మెహర్ కుమార్‌తో కలిసి ఆదివారం కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024లో చేపట్టిన అభివృద్ధి పనులు, కొత్త సంవత్సర ప్రణాళికను, అందించనున్న సేవలను వివరించారు. కొత్త ఏడాది రోగులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్య సేవలందిస్తూ వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా మెలిగేలా చూస్తామన్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా స్పోర్ట్స్ మెడిసిన్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, రుమటాలజీ, వాస్క్యులర్ సర్జరీ, నియోనాటాలజీ, ఫ్యామిలీ మెడిసిన్, క్షతగాత్రుల చికిత్సకు కొత్త విభాగాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోగుల వైద్య పరీక్షల వివరాల సంక్షిప్త సమాచారాన్ని మొబైల్‌కు పంపిస్తామన్నారు. రోగుల కోసం హెల్ప్ డెస్క్‌లు, కౌన్సెలింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.15 కోట్లు వెచ్చించి లెనెక్ యంత్ర పరికరంతో కేన్సర్ వైద్య చికిత్స అందుబాటులో ఉంచినట్లు డాక్టర్ శివానంద్ వివరించారు. రూ.2.5 కోట్లతో కాలిన గాయాలకు చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ వార్డును అభివృద్ధి చేస్తామన్నారు.

నగరంలో పేకాట డెన్‌లు!

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ద్వారకానగర్, నరసింహనగర్, అక్కయ్యపాలెం, సీతమ్మధార, ఎంవీపీకాలనీ, సాగర్‌నగర్, రుషికొండ, శివాజీపాలెం, రేసపువానిపాలెం, రామాటాకీస్ పరిసరప్రాంతాల్లోని లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లను పేకాట స్థావరాలుగా మారుస్తున్నారు. ఆర్థికంగా స్థితిమంతులు, వ్యాపారులు నిర్వాహకుల పాత్రను పోషిస్తున్నారని సమాచారం. స్నేహితులు, తెలిసిన వారి ద్వారా మరికొంతమందిని పోగేసి, ఏదో ఒక హోటల్ లేదా గెస్ట్‌హౌస్‌లో గదిని బుక్‌చేస్తున్నారు. ఫోన్‌లోనే సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. రోజూ ఒకేచోట కాకుండా తరచూ వేదికలు మారుస్తున్నారని తెలిసింది.

సకల సదుపాయాలు

పేకాట రాయుళ్లకు భోజనం, స్నాక్స్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పిస్తుండడంతో ఎక్కువమంది ఆకర్షితులవుతున్నట్టు తెలిసింది. అంతేకాదు డబ్బు అవసరమైన వారికి అక్కడే బంగారం తాకట్టుపెట్టుకుని అప్పు ఇచ్చే సదుపాయం అందుబాటులో ఉంచడం విశేషం. పేకాట ఆడేందుకు గది అద్దెతోపాటు ఆహారం, స్నాక్స్ ఖర్చుల కోసం ప్రతీ ఆటలోనూ కొంతమొత్తాన్ని నిర్వాహకుడే మినహాయించుకుంటున్నారని చెబుతున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్, ఎంవీపీ పోలీసులు శివాజీపార్క్ ఎదురుగా ఉన్న హోటల్ ఎంవీపీలో పేకాట గుట్టు రట్టు చేశారు. ద్వారకానగర్‌లోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నవారిని పట్టుకున్నారు. కాగా నగరంలోని సగానికి పైగా హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల్లో నిత్యం పేకాట జరుగుతోందని పోలీసులకు తెలుసని, అయినా చర్యలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా న్యూఇయర్, సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట సంస్కృతి విస్తరిస్తోంది. 15-20 రోజులుగా మరింత పెరిగిందని పోలీసు సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు. పేకాటలో డబ్బు పోగొట్టుకున్న కొంతమంది ఇళ్లలో గొడవలు జరిగి పోలీసులను ఆశ్రయిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సీపీ శంఖబ్రతబాగ్చి పేకాట సంస్కృతిని అడ్డుకునే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బైక్ బోల్తా పడి విద్యార్థి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం



సాకేత్ (ఫైల్‌ఫొటో)

సాగర్‌నగర్/అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సమీపంలోని మలుపు వద్ద ఆది వారం ఉదయం బైక్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గాజువాకలోని అక్కిరెడ్డిపాలెంకు చెందిన దువ్వి సాకేత్ (19), టి. సాయి మహర్షి ఎండాడలో ఉన్న స్నేహితుడ్ని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా బీచ్ రోడ్డులో అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల సమీపంలో ఉన్న మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్ నడుపుతున్న సాకేత్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయి మహర్షి తలకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు సాయి మహర్షిని గీతం ఆసుపత్రికి తరలించారు. సాకేత్ ఎంవీపీ కాలనీలోని ప్రైవేట్ కళాశాలలో మొదటి సంవత్సరం బీబీఏ చదువుతుండగా, సాయిమహర్షి అనకాపల్లిలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి డి. వెంకటేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రతి ఏడాది చివరిలో యువత జోష్‌లో వుండి ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వద్ద ఉన్న మలుపులో గత ఏడాది చివరిలో జరిగిన పలు ప్రమాదాల్లో చాలామంది మృతి చెందారు. ఈ మలుపు వద్ద సాధారణ వేగంతో వచ్చిన వాహనాలనే అదుపు చేయడం కష్టం. అటువంటిది వంద కిలోమీటర్ల వేగంతో వచ్చే వాటిని అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. బీచ్ రోడ్డులో పలుచోట్ల ప్రమాదకర మలుపు ఉన్నాయి. అధికారులు తక్షణమే మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు

పులకించిన సాగర తీరం

- 1800 మంది కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన

పెదవాల్తేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాట్య కళాకారుల గజ్జెల సవ్వడితో సాగర తరంగాలు పోటీ పడ్డాయి. వేలాది మంది కళాకారుల నృత్య ప్రదర్శనతో ఆహూతుల హృదయం పులకించింది. కూచిపూడి నాట్య పతాక 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీరంలోని లైట్‌హౌస్ పక్కనున్న ఎంజీఎం పార్క్ మైదానంలో నటరాజ్ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) సారథ్యంలో మూడు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈమేరకు ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన 1,800 మంది కళాకారులతో బ్రహ్మాంజలి మహా బృంద నృత్య ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్, తమిళనాడు, ఒడిశా, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.అనంతరం నిర్వాహకులు కళాకారులను ఘనంగా సత్కరించి, అవార్డులు అందజేశారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

రాజ్యాధికారంతోనే బీసీల సమస్యలు పరిష్కారం

డాబాగార్డెన్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీల సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాలనే అంశంపై సమావేశం నిర్వహించారు. బీసీలకు రావాల్సిన వాటాను ఓసీ సామాజిక వర్గాలు లాక్కుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయలేదని, జాతీయ కులగణన జరపలేదని, బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించలేదన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అమీనొద్దీన్, కార్యదర్శి కామేట భూపాల్, బానోతు లింగన్న, మధు భూంపల్లి, రావణ్, రాంబాబు, పాల్గొన్నారు.

ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. వాటిలో మొత్తం 12 పోస్టులు ఉండగా 10 ఖాళీగా ఉన్నాయి. అడ్డాకుల డిస్పెన్సరీలో మాత్రమే మెడికల్ ఆఫీసర్, కాంపౌడర్ ఉన్నారు. అక్కడ స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు ఖాళీగానే ఉంది. మిగిలిన మూడు (అరకు, డుంబ్రిగుడ, గంపరాయి) డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల మూడు డిస్పెన్సరీల పరిధిలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే జిల్లాలో మూడు హోమియో డిస్పెన్సరీలు ఉండగా, పాడేరులో మాత్రమే మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. అక్కడ కూడా కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీలేరు, తాజంగిలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీ. ఈ రెండు డిస్పెన్సరీల బాధ్యతలను పాడేరు మెడికల్ ఆఫీసరే చూస్తుంటారు.

అనకాపల్లి జిల్లాలోనూ అంతే...

అనకాపల్లి జిల్లాలో 11 ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా, 34 పోస్టులకుగాను 22 ఖాళీగా ఉన్నాయి. వేంపాడులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, హరిపాలెంలో కాంపౌండర్, ఏఎన్ఎం, అటెండర్, గవరపాలెం, లింగరాజుపాలెం, కొత్తకోట, దేవరాపల్లిల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కన్నూరుపాలెంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, ఎంఎన్‌వో మాత్రమే పనిచేస్తున్నారు. హోమియో డిస్పెన్సరీల విషయానికి వస్తే..ఎలమంచిలిలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు, పాయకరావుపేటలో కాంపౌండర్, ఎ.కొండూరులో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఏఎల్ పురంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఎం.కోడూరులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్ పోస్టులు, అచ్యుతాపురం డిస్పెన్సరీలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

... 5వ పేజీ తరువాయి

కాదన్నారు. అనుమానం వచ్చిన వారిని ఇలా తనిఖీ చేయడం జైళ్లు, పోలీసు శాఖలో సాధారణమేనన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డర్ ఒకరు కొంత మంది ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే అనుమానితుడిని తనిఖీ చేశారన్నారు. జైలులో ఇబ్బందికర వాతావరణం నెలకొందనే సమాచారం మేరకు ప్రభుత్వం మహేశ్‌బాబును సూపరింటెండెంట్‌గా నియమించి, సరిదిద్దే బాధ్యతను అప్పగించిందన్నారు. ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర కారాగారంలో సుమారు రెండు వేల మందికి పైగా ఖైదీలున్నారని. వారిలో 82 మంది రౌడీషీటర్లు కూడా ఉన్నారన్నారు. బ్యారక్స్‌లను ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు అన్‌లాక్, సాయంత్రం ఆరు గంటలకు లాకప్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఉదయం వార్డర్ తాళాలు తీయాల్సి ఉండగా ఆ పనిని ఖైదీలతో చేయించడం చట్టవిరుద్ధమన్నారు. దీనిని సూపరింటెండెంట్ ప్రశ్నిస్తే అది ఇక్కడ మామూలే అని సమాధానమివ్వడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. జైలులో సమస్యలను నివారించేందుకు సుమారు 200 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్టు డీఐజీ వివరించారు.

తీరంలో సందడి

కొనసాగుతున్న నేవీ రిహార్సల్స్

తూర్పు నౌకా దళం ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం రిహార్సల్ కొనసాగాయి. సాయంత్రం 4.30 నుంచి ఆరు గంటల వరకు విన్యాసాలు అబ్బురపరిచాయి. జనవరి 4న జరిగే సాహస విన్యాసాల ప్రదర్శనలో భాగంగా ఆదివారం రిహార్సల్స్ యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. సాగరతీరం బాంబు పేలుళ్లతో మోతక్కిపోయింది. ఆకాశం నుంచి స్కైడైవర విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, నిఘా విమానాలు, యుద్దనౌకలు, సబ్‌మెరైన్ల సహాయంతో నేవీ సిబ్బంది ప్రత్యర్థులతో పోరాడే తీరును కళ్లకు కట్టినట్టుగా ఆవిష్కరించారు. శత్రు స్థావరాలపై దాడి, సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడం, హెలికాప్టర్లతో అత్యవసర పరిస్థితుల్లో రోప్ సహాయంతో కిందకు దిగడం ఆకట్టుకున్నాయి. నేవీ అధికారులు, వారి కుటుంబసభ్యులతోపాటు వేలాదిగా సందర్శకులు విన్యాసాలను తిలకించారు.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


కవాతు చేస్తున్న సముద్ర యోధులు


శత్రు మూకలపై దాడులు చేస్తున్న మెరైన్ కమెండోలు


ఆపదలో ఉన్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్


తీరంలో శత్రువులపై దాడులు చేస్తున్న కమెండోలు, తిలకిస్తున్న సందర్శకులు


వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన యుద్ధ నౌకలు


యుద్ధ విమానాలతో ప్రదర్శన


సభ్యత్వ నమోదు చేస్తున్న శంకరరావు, తదితరులు

టీడీపీ సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎంతో కృషి చేస్తుందని పార్టీ 70వ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు అన్నారు. వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, ఎల్‌వీనగర్ కాలనీల్లో ఆదివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.100 టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు ఆ కుటుంబానికి భరోసా, భద్రత, లభిస్తుందన్నారు. కార్యకర్తల సంక్షేమమే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డేడ రమణ, పీఎంఎల్ నాయుడు, రాజా, ఎంఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: గ్రేటర్ 85వ వార్డు పరిధి కొండయ్యవలస నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు శిబిరాలను ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణులు పలువురితో సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, బండారు చందు, వి.శ్రీను, రామకృష్ణ, మోహన్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

1,417వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలని కోరుతూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,417వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణే ప్రజలందరి ధ్యేయం కావాలన్నారు. ఉక్కు కార్మికులకు తక్షణమే వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నేతలు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్‌రావు, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 20, క్యారెట్ 40, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 30, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, క్రరపెండలం 28, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	102
ఫారం ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ అభివృద్ధి పనులే నియోజకవర్గ ప్రగతికి తార్కాణంగా నిలుస్తాయన్నారు. ఆదివారం ఆయన రూ.రెండు కోట్ల వ్యయంతో 76వ వార్డు పరిధి డెయిరీ కాలనీ, రామచంద్రానగర్, భరత్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రహదారులను ఆధునీకరించే క్రమంలో వాటిని వీలైనంత మేరకు వెడల్పు చేయాల్సి ఉంటుందని, దీనివల్ల భవిష్యత్తులో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురవ్వకుండా ఉంటాయని, అందుకు స్థానికులు, అధికారులు సహకరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తుందని పేర్కొన్నారు. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ఇంకా చేయాల్సిన వాటి ప్రతిపాదనలను అధికారుల దృష్టిలో పెట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బాసెట్టి అప్పారావు, కార్యదర్శి తాటికొండ సుదర్శనరావు, నాయకులు పి.రమణ, పి.ఉగ్రం, మంత్రి శంకర నారాయణ, బొడ్డు సత్యారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఇంటక్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ ఆధ్వర్యంలో సీతానగరంలో మహిళలకు పల్లా శ్రీనివాసరావు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

'కార్మిక సంక్షేమమే ఇంటక్ లక్ష్యం'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపులో ఉన్నా, లేకున్నా కార్మిక సంక్షేమ విషయంలో రాజీ లేని పోరాటాలు చేస్తామని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేశామని, నూతన ఏడాదిలోనైనా ప్లాంటును ప్రైవేటీకరించబోమని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, జి.ప్రభాకర రెడ్డి, ఎస్‌పి నాయుడు, పీవీ రమణమూర్తి, డి.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల వివాదం: స్తంభించిన ట్రాఫిక్

కూర్మన్నపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం విక్రయించిన ద్విచక్ర వాహనం పేరు బదిలీకి సంబంధించి ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఇక్కడి మటన్ దుకాణంలో పనిచేస్తున్న అబ్బు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని యాదవ జగ్గరాజుపేటకు చెందిన వ్యక్తికి విక్రయించారు. అయితే పేరు బదిలీ ప్రక్రియపై కొద్ది రోజులుగా వివాదం నడుస్తోంది. ఆదివారం ఈ విషయమై వీరిద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగింది. దీంతో మటన్ దుకాణం వద్ద ఇరు వర్గాల వారు కొట్లాటకు దిగడంతో ట్రాఫిక్‌కు గంటపాటు అంతరాయం వాటిల్లింది. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలందరి సంక్షేమమే కేంద్రం లక్ష్యం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ

గాజువాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ అన్నారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజవర్గంలోని తొమ్మిది మండల అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాకలో పార్టీ బలంగా ఉందన్నారు. గాజువాక మండల అధ్యక్షునిగా ఒమ్మి రంగనాయకులు, గంగవరానికి పేర్ల అప్పారావు, నాతయ్యపాలేనికి తమ్మిన నాగరాజు, పాతగాజువాకకు దీనంకొండ పావని, చినగంట్యాడకు జి.మహేశ్, పెదగంట్యాడకు వరలక్ష్మి, ఉక్కునగరానికి అనితకుమారి, అగనంపూడికి కె.త్రినాథ్, వడ్లపూడికి చోద్రోలు అశోక్‌ను నియమించారు. కార్యక్రమంలో 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు బొండా యల్లాజీరావు, నూకరాజు, అప్పలరాజు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి విద్యార్థి మృతి: మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన సాకేత్ (ఫైల్)

సాగర్‌నగర్/అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ సమీపంలోని మలుపు వద్ద ఆదివారం ఉదయం బైక్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కిరెడ్డిపాలేనికి చెందిన దువ్వి సాకేత్ (19), టి. సాయి మహర్షి ఎండాడలో ఉన్న స్నేహితుడ్ని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా బీచ్ రోడ్డులో అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల సమీపంలోని ఓ మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్ నడుపుతున్న సాకేత్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయి మహర్షి తలకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు సాయి మహర్షిని గీతం ఆస్పత్రికి తరలించారు. సాకేత్ ఎంవీపీ కాలనీలోని ప్రైవేటు కళాశాలలో బీబీఏ ఫస్టియర్ చదువుతుండగా, సాయి మహర్షి అనకాపల్లిలో డిప్లొమా సెకండియర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి డి.వెంకటేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌కు హంగులు

శరవేగంగా ఆధునీకీకరణ పనులు ● 'అమృత్ భారత్' నిధులతో శ్రీకారం



ప్రస్తుత సింహాచలం రైల్వే స్టేషన్ ముఖ చిత్రం

గోపాలపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ స్టేషన్‌ను రూ.19.5కోట్లను మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయి. దీంతో 25 రైళ్లు మాత్రమే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేక పోవడంతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన సింహాచలానికి వచ్చే భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పలు రైళ్లలో ఇక్కడికి వచ్చేవారు ముందుగా విశాఖనగరంలోని ప్రధాన స్టేషన్‌లో దిగుతున్నారు. అనంతరం అక్కడి నుంచి అప్పన్న పుణ్య క్షేత్రానికి చేరుకుంటున్నారు. ఈ తరుణంలో స్టేషన్‌ను అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో తీర్చిదిద్దుతుండడంతో త్వరలో స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.


రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన భవనం

అప్పన్న ఆలయ గోపురం నమూనాతో కొత్త భవనం

ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ ప్రారంభంలోని భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఆలయ గోపురం నమూనాతో కొత్త భవన నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్ ఫారాలతో పాటు అదనంగా మరొక రెండు లైన్లు నిర్మించి ప్లాట్ ఫారాల నిర్మాణం చేపట్టనున్నారు. స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రయాణికులు ప్రధాన రహదారికి చేరుకోడానికి స్టేషన్‌లోపలి నుంచి నేరుగా బీఆర్‌టీఎస్ రహదారిని చేరుకునే విధంగా రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

మరొక ఫుట్‌ఓవర్ వంతెన

ఇదిలావుంటే, స్టేషన్‌కు వచ్చిపోయే ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా మరొక ఫుట్‌ఓవర్ వంతెన నిర్మాణం జరుగుతోంది. ఆధునికీకరణ పనులు పూర్తయితే ఇక్కడికి వచ్చే ప్రయాణికులతో పాటు సింహాద్రి అప్పన్న దర్శనానికి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యం కలగనుంది.

ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు

ట్రాఫిక్ సీఐ దాశరథి


ఎన్ఏడీ జంక్షన్‌లో దుకాణాల ముందు ఉన్న వాహనాలను తొలగిస్తున్న పోలీసులు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 90వ వార్డు పరిధిలోని బాజీజంక్షన్ నుంచి ఎన్ఏడీ వరకు రహదారిలో దుకాణాల ముందు రాకపోకలకు ఇబ్బందిగా పార్కింగ్ చేసిన వాహనాలను కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ఉదయం తొలగించారు. బాజీజంక్షన్ నుంచి ఎన్ఏడీ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వరకు ఇరువైపులా ఉన్న దుకాణసముదాయాల ముందు ఇష్టారాజ్యంగా పలువురు వాహనాలను ఉంచారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి హెచ్చరించారు.

నేత్రపర్వంగా ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

- పెందుర్తి వేంకటాద్రి శిఖరంపై స్వామివారికి విశేష పూజలు
- భారీగా తరలి వచ్చిన భక్తజనం ● ఉచిత బస్సు సౌకర్యం
- సీహెచ్.అగ్రహారం గవరపాలెంలో గోదా రంగనాథుల తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా నిశ్చయ తాంబూలాలు

పెందుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వేంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం విశేష అలంకరణలు చేపట్టి పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. తిరుప్పావై పఠించి, గోదాదేవి పదమూడో పాశురాన్ని స్వామికి నివేదించారు. ఆరు ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గిరి పైకి స్వామి దర్శనార్థం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

పెందుర్తి రూరల్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలో చింతల అగ్రహారం గవరపాలెం గీతాకృష్ణా దేవాలయంలో గోదా రంగనాథు తిరు కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిశ్చయ తాంబూలాల వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్ గోపీ అప్పలనాయుడు, డబ్బీరు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.


నిశ్చయ తాంబూలాలు స్వీకరిస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ

బాలబాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి మూడు నుంచి కర్నూలులో జరగనున్న 50వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. గాజువాక హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు బాలుర విభాగంలో 120 మంది, బాలికల విభాగంలో 42 మంది హాజరయ్యారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి 22 మందిని, బాలికల విభాగంలో 20 మందిని ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన అనంతరం తుది జట్టును ఎంపిక చేస్తామని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, పి.కోటేశ్వరరావు, జాతీయ శిక్షకులు ఉమాశంకర్, ఎం.గణపతి, ఎ.దాసు, పి.రమణ, రాము, నిరుపమ, అచ్చిలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన జిల్లా క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

కూర్మన్నపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించడంలో ఉపాధ్యాయులది కీలక భూమిక అని సింబయోసిస్ సీఈవో ఓరుగంటి నరేశ్‌కుమార్ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ గ్రీన్ సిటీ ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షికోత్సవాలను ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల అభిరుచులను గమనిస్తూ, వారిని ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు దూరంగా ఉంచాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఈడీ డాక్టర్ ఈ.శంకరరావు, సత్యభాస్కర్, సుశీల, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ ఛైర్మన్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓరుగంటి నరేశ్‌కుమార్, బండి సురేశ్‌కుమార్, తదితరులు

కాపులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి: 'కరణంరెడ్డి'

గాజువాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, తూర్పు కాపులకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలని కాపు సంఘం ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక శ్రీకృష్ణదేవరాయల కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపులకు పదవులు ఇవ్వాలంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను కలుస్తామన్నారు. నెల రోజుల్లో గాజువాక శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. నాయకులు గుడివాడ అమ్మన్న, గంధం వెంకటరావు, అప్పారావు, రమణ, రామచంద్రరావు, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయంలో రద్దీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈనేపథ్యంలో భక్తులు అమ్మవారిని దర్శనానికి భారీ సంఖ్యలో ఆదివారం ఆలయానికి తరలివచ్చారు. టిక్కెట్, ఉచిత దర్శనాల క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను దర్శించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. క్షీరాభిషేకాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత అన్నప్రసాదానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో కేంద్రమంత్రి కింజరాపు



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ

సిరిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం సందర్శించారు. ఆయనకు సీఎంఆర్ షాపింగ్ మాల్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ ఘనస్వాగతం పలికారు. తదుపరి కేంద్రమంత్రితో కలిసి షాపింగ్‌మాల్‌లో అన్ని విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

రైఫిల్ షూటింగ్ జట్టు ప్రాబబుల్స్‌లో సాయి కౌశిక్



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత రైఫిల్ షూటింగ్ జట్టు ప్రాబబుల్స్‌కు నగరానికి చెందిన పేపకాయల సాయి కౌశిక్ ఎంపికయ్యాడు. త్వరలో తుది జట్టుకు జరిగే ఎంపికల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నాడు. ఈ నెల భోపాల్‌లో జరిగిన 67వ జాతీయ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో సాయి కౌశిక్ ప్రతిభ కనబరిచి 10 మీటర్ల పీప్ సైట్, 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్లలో అత్యధిక పాయింట్లు సాధించి భారత్ జట్టు ప్రాబబుల్స్‌కు అర్హత దక్కించుకున్నాడు. ఇప్పటివరకు అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ టోర్నీలో 12 పతకాలు సాధించిన సాయి కౌశిక్, అతి చిన్న వయసులో (14 ఏళ్లు) భారత జట్టు ప్రాబబుల్స్‌కు అర్హత సాధించడం విశేషమని కోచ్ ఉమాశంకర్ హర్షం వ్యక్తం చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ గణేష్

మురళీనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి); గ్రేటర్ 50వవార్డు మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య సేవల మెగా శిబిరం చేపట్టారు. ఇందులో కిమ్స్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ కె.గణేష్ రోగులకు ఉచితంగా గుండె సంబంధిత వ్యాధుల పరీక్షలు చేపట్టారు. నివారణకు ముందస్తు సూచనలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామ అవసరాలపై సూచనలు చేశారు. కిమ్స్ ఆసుపత్రి అంకాలజిస్ట్ వి.శ్రీనివాస్ కేన్సర్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి నిర్ధారణ, ఈసీజీ పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ పల్లా చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన వైద్యశిబిరంలో కార్యదర్శి చెల్వరాజు, కమిటీ సభ్యులు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు.

కేజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు

▸50 పడకలతో అధునాతన వైద్య పరికరాల క్యాజువాలిటీ ▸ రోగుల మొబైల్స్‌కు వైద్య పరీక్షల నివేదికల సంక్షిప్త సందేశాలు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శివానంద్, చిత్రంలో ఆర్ఎంఓ మెహర్ కుమార్

మహారాణిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో 50 పడకల సామర్థ్యంతో సెంట్రల్ ఏసీ స్కానింగ్ ఎక్స్‌రే, అనుబంధ మెడికల్ ల్యాబ్‌లతో కొత్త కాజువాలిటీ విభాగం ఏర్పాటు చేయనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వెల్లడించారు. ఆర్ఎంఓ మెహర్ కుమార్‌తో కలిసి ఆదివారం కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024లో చేపట్టిన అభివృద్ధి పనులు, కొత్త సంవత్సర ప్రణాళికను, అందించనున్న సేవలను వివరించారు. కొత్త ఏడాది రోగులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్య సేవలందిస్తూ వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా మెలిగేలా చూస్తామన్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా స్పోర్ట్సు మెడిసిన్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, రుమటాలజీ, వాస్క్యులర్ సర్జరీ, నియోనాటాలజీ, ఫ్యామిలీ మెడిసిన్, క్షతగాత్రుల చికిత్సకు కొత్త విభాగాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రోగుల వైద్య పరీక్షల వివరాల సంక్షిప్త సమాచారాన్ని మొబైల్‌కు పంపిస్తామన్నారు. రోగుల కోసం హెల్ప్ డెస్కులు, కౌన్సెలింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.15 కోట్లు వెచ్చించి లెనెక్ యంత్ర పరికరంతో కేన్సర్ వైద్య చికిత్స అందుబాటులో ఉంచినట్లు డాక్టర్ శివానంద్ వివరించారు. రూ.2.5 కోట్లతో కాలిన గాయాలకు చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ వార్డును అభివృద్ధి చేస్తామన్నారు. 190 సీసీ కెమేరాలు అమర్చామన్నారు. హీమోఫీలియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం లక్షలాది రూపాయల విలువ చేసే చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో సిబ్బంది రోగుల నుంచి లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జైలులో నిషిద్ధ వస్తువులు ఉంటే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ బాగ్చి, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్, జైళ్ల అధికారి రవికిరణ్

ఆరిలోవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైలు సిబ్బంది, ఖైదీలలో ఎవరి వద్ద నిషిద్ధ వస్తువులు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌తో కలిసి ఆదివారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలు తప్పనిసరిగా జైలు నిబంధనలు పాటించాలని, గంజాయి, బీడీలు, మొబైల్ ఫోన్లు వంటివి వినియోగించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. రౌడీషిటర్లుగా ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనతో విడుదలైతే నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జైళ్ల ఉన్నతాధికారి (కోస్తాంధ్ర) ఎంఆర్ రవికిరణ్ మాట్లాడుతూ ఖైదీలు కుటుంబాలతో మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు పాల్గొన్నారు.

సాహితీ ప్రముఖులకు పురస్కారాలు



సమావేశంలో పాల్గొన్న సాహితీ ప్రముఖులు

సీతంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్న వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో తటవర్తి భారతి స్మారక సాహితీ సభ, పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, విశిష్ట అతిథిగా నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ప్రముఖ రచయిత కృపాకర్ పోతుల హాజరయ్యారు. కథ, కథనం, కథాపఠనం, రికార్డింగ్‌లో మెలకువలు, విమర్శ, సమీక్ష, ఇష్టాగోష్టి, చర్చ, ముఖాముఖి వంటి కార్యక్రమాలు తెలుసుకోవడం గొప్ప విషయమన్నారు. సాహితీ సభ అధ్యక్షుడు తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి సభను నిర్వహించగా, వర్రే నాంచారయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సాహితీ పురస్కార గ్రహీతలు దాట్ల దేవదానం రాజు, ఈతకోట సుబ్బారావు, డా.ఎం.సుగుణరావు, ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ, డా.డి.వి.సూర్యారావు, రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు, ఇందూ రమణ, గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు, తటవర్తి శంకరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డిలకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు.

రాజ్యాధికారంతోనే బీసీల సమస్యల పరిష్కారం: ప్రసాద్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌గౌడ్

డాబాగార్డెన్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీల సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాలనే అంశంపై సమావేశం నిర్వహించారు. బీసీలకు రావాల్సిన వాటాను ఓసీ సామాజిక వర్గాలు లాక్కుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయలేదని, జాతీయ కులగణన జరపలేదని, బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించలేదన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అమీనొద్దీన్, కార్యదర్శి కామేట భూపాల్, బానోతు లింగన్న, మధు భూంపల్లి, రావణ్, రాంబాబు, సందీప్‌గౌడ్, కొత్తఅంగయ్యగౌడ్, అయినవెల్లి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు

మురళీనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో 2025 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేపట్టనున్నట్టు పార్క్ కమిటీ అధ్యక్షుడు ననపల వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 31న రాత్రి నృత్యాలు, ఆహార మేళా, సాంస్కృతిక కార్యక్రమాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కోశాధికారి రామకృష్ణ, కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

కళలతో మానసిక ఉల్లాసం



వేదికపై కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కళలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని పలువురు కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాగ రంజని సినీ, లలిత, జానపద, భక్తి గీతాల సంగీత సంస్థ ఆధ్వర్యంలో 75వ సినీ గీతాల సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విశ్రాంత అధికారి వై.రంగారావు చౌదరి, రాగ రంజని వ్యవస్థాపకుడు పి.రామచంద్రరావు, సోషల్ మీడియా క్లబ్ చైర్మన్ సన్‌మూర్తి, శ్యామ్‌సుందర్, ఘంటసాల స్పోర్ట్స్ కార్యదర్శి చెన్నా తిరుమలరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. మన సంస్కృతి, సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. తదుపరి రామచంద్రరావు, శ్యామ్‌సుందర్, జ్యోతి, అరుణ్‌కుమార్, కేశవరావు, జ్యోతి, భయ్యా శ్రీనివాస్, సూర్యప్రభ, గాయనీ గాయకులు ఆలపించిన గీతాలతో రంజింపజేశారు. కార్యక్రమానికి రైల్వే రమణ, గుణశ్రీ, మెలోడీ సత్యనారాయణ, గంటి నాగేశ్వరరావు, వీరస్వామి, గౌరీ పాడిన పాటలకు సోమేశ్ కీబోర్డు, సాయి, అప్పలరాజు తబలా, బాబ్జి ప్యాడ్‌లపై చక్కని సంగీతాన్ని అందించారు.

చిత్రలేఖనం విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలతో వైద్యాధికారిణి హేమలత, నంద కిశోర్ తదితరులు

కంచరపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ఆర్ భవనంలో విశాఖ చిత్ర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసీ వైద్యాధికారిణి డా.పి.హేమలత, విశాఖ వ్యాలీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.నందకిశోర్, గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాల కోటేశ్వర్రావు తదితరులు పాల్గొని చిన్నారులకు బహుమతులు అందజేశారు. చిన్నారులు చదువుతో పాటు లలిత కళలపై ఆసక్తి కనబరిచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తొలుత ప్రముఖ చిత్రకారులు వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. అనంతరం శ్రీకాకుళానికి చెందిన యువ చిత్రకారుడు వి.రాహుల్ పట్నాయక్‌కు చిత్ర కళాపరిషత్ వసా స్మారక అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సుంకర చలపతిరావు, పైడిరాజు, మనోహర్, బుజ్జి, శివ, నాగేశ్వర్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి: పరుశురామ్



సమావేశంలో మాట్లాడుతున్న పరుశురామ్

డాబాగార్డెన్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జె.పరుశురామ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించకపోవడమంటే చరిత్రను వక్రీకరించడమేనన్నారు. గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆళ్ల రామకృష్ణ, కంఠ వేణు, యజ్జల గురుమూర్తి, కొంగరపు గణపతి పాల్గొన్నారు.

గోడు పట్టదా!

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి లేఅవుట్‌లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు వంటి సదుపాయాలు కల్పించే బాధ్యత వీఎంఆర్‌డీఏదే. భూములిచ్చిన రైతులకు ఒక వైపుగా, మిగిలిన వైపు ప్లాట్లు విక్రయిస్తామని జిల్లా అధికారులు వివరించారు.

జీడితోటలు ధ్వంసం

ఇందులో భాగంగా సేకరించిన భూముల్లోని జీడితోటలను తొలగించారు. 2022 జనవరి తరువాత భూములను రెవెన్యూ అధికారులు వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. రామవరం, గంగసాని అగ్రహారంలో జీడితోటల నుంచి రైతులు ఏటా జీడిపిక్కలు సేకరించేవారు. మూడు, నాలుగు ఎకరాల రైతులకు ఏడాదికి రెండున్నర నుంచి మూడు లక్షల ఆదాయం లభించేది. తోటలు తొలగించడంతో మూడేళ్లపాటు ఫలసాయం కోల్పోయారు. కాగా లేఅవుట్‌గా అభివృద్ధి చేసి ప్లాట్లుగా విభజించడంతో అధికారులు విఫలమయ్యారు. అప్పుడప్పుడు వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించడమే మినహా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రెండు నెలల క్రితం రామవరం, గంగసాని అగ్రహారం రైతులు జిల్లా యంత్రాంగాన్ని, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి గోడు వినిపించారు. మూడేళ్లుగా తోటల ఫలసాయం కోల్పోయామన్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది ఉంటే పూర్తి హక్కులు లభించేవన్నారు. అందువల్ల ఎకరాకు 1,200 గజాల ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించకపోతే భూములను తిరిగి స్వాధీనం చేసుకుని తోటలు పెంచుతామని స్పష్టం చేశారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు

రామవరంలో మా తండ్రికి ఇచ్చిన రెండెకరాల డీపట్టా భూమిలో జీడి తోట వేశాం. ఏటా 20నుంచి 25 బస్తాల జీడిపిక్కలు లభించేవి. మూడేళ్లుగా ఆదాయం కోల్పోయాం. తోటలు తొలగించిన అధికారులు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తే విక్రయించే వీలుండేది. అది జరగకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

- అదరపు దేముడుబాబు, రామవరం

శభాష్..కార్తీక్



టీడీపీ నాయకుడు కార్తీక్‌కు అభినందిస్తూ ప్రశంసాపత్రం అందిస్తున్న సీపీ బాగ్చి

కంచరపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్ కుట్టాను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శనివారం అభినందించారు. గత నెల 29న ఐటీఐ జంక్షన్ సమీపంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలపై యాసిడ్ దాడి జరిగేటప్పుడు కార్తీక్ కుట్టా దగ్గరుండి బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లి వారికి సకాలంలో వైద్యం అందేలా కృషిచేశారు. బాధితులు భయపడకుండా ధైర్యం చెప్పి సపర్యలు చేశారు. కార్తీక్ చొరవకు సీపీ బాగ్చి శాలువా కప్పి అభినందించారు. కార్తీక్‌ను పలువురు అభినందించారు.

పులకించిన సాగర తీరం

1,800 మంది కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు

పెదవాల్తేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాట్య కళాకారుల గజ్జెల సవ్వడితో సాగర తరంగాలు పోటీ పడ్డాయి. వేలాది మంది కళాకారుల నృత్య ప్రదర్శనతో ఆహూతుల హృదయం పులకించింది. కూచిపూడి నాట్య పతాక 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీరంలోని లైట్‌హౌస్ పక్కనున్న ఎంజీఎం పార్క్ మైదానంలో నటరాజ్ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) సారధ్యంలో మూడు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈమేరకు ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన 1,800 మంది కళాకారులతో బ్రహ్మాంజలి మహా బృంద నృత్య ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్, తమిళనాడు, ఒడిశా, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు కళాకారులను సత్కరించి అవార్డులు అందజేశారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష బోధన తరగతులు



ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న రామేశ్వర్ గౌడ్

కంచరపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ సహకారంతో 40 రోజులు ఉచిత ఆన్‌లైన్ ఆంగ్ల భాష బోధన తరగతులు నిర్వహిస్తారు. ఇందుకోసం ఆదివారం ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్ఞానాపురం జూబ్లీ స్కూల్లో నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ఏఎంవో డా.జి.లక్ష్మి మాట్లాడారు. విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఆంగ్లంలోనూ మాట్లాడగలగాలన్న ధ్యేయంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తొలుత విశాఖ జిల్లాలో శిక్షణ ప్రారంభిస్తామన్నారు. 300 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందగిరినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నందగిరినగర్ సేవాసంఘం, లక్ష్మీ గాయత్రి ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నందగిరినగర్‌లో నిర్వహించారు. ఈ మేరకు ఆసుపత్రి వైద్య సిబ్బంది స్థానికులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ రామ్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి ఉచితంగానే మందులు పంపిణీ చేశామన్నారు. ఆసుపత్రి వైద్యుడు రమేష్, నర్స్ సుజాత, సిబ్బంది దినేష్, సంఘం అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. వాటిలో మొత్తం 12 పోస్టులు ఉండగా 10 ఖాళీగా ఉన్నాయి. అడ్డాకుల డిస్పెన్సరీలో మాత్రమే మెడికల్ ఆఫీసర్, కాంపౌడర్ ఉన్నారు. అక్కడ స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు ఖాళీగానే ఉంది. మిగిలిన మూడు (అరకు, డుంబ్రిగుడ, గంపరాయి) డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల మూడు డిస్పెన్సరీల పరిధిలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే జిల్లాలో మూడు హోమియో డిస్పెన్సరీలు ఉండగా, పాడేరులో మాత్రమే మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. అక్కడ కూడా కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీలేరు, తాజంగిలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీ. ఈ రెండు డిస్పెన్సరీల బాధ్యతలను పాడేరు మెడికల్ ఆఫీసరే చూస్తుంటారు.

అనకాపల్లి జిల్లాలోనూ అంతే...

అనకాపల్లి జిల్లాలో 11 ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా, 34 పోస్టులకుగాను 22 ఖాళీగా ఉన్నాయి. వేంపాడులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, హరిపాలెంలో కాంపౌండర్, ఏఎన్ఎం, అటెండర్, గవరపాలెం, లింగరాజుపాలెం, కొత్తకోట, దేవరాపల్లిల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కన్నూరుపాలెంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, ఎంఎన్‌వో మాత్రమే పనిచేస్తున్నారు. హోమియో డిస్పెన్సరీల విషయానికి వస్తే ఎలమంచిలిలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు, పాయకరావుపేటలో కాంపౌండర్, ఎ.కొండూరులో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఏఎల్ పురంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఎం.కోడూరులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్ పోస్టులు, అచ్యుతాపురం డిస్పెన్సరీలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

... 5వ పేజీ తరువాయి

కాదన్నారు. అనుమానం వచ్చిన వారిని ఇలా తనిఖీ చేయడం జైళ్ల, పోలీసు శాఖలో సాధారణమేనన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డర్ ఒకరు కొంతమంది ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే అనుమానితుడిని తనిఖీ చేశారన్నారు. జైలులో ఇబ్బందికర వాతావరణం నెలకొందనే సమాచారం మేరకు ప్రభుత్వం మహేశ్‌బాబును సూపరింటెండెంట్‌గా నియమించి, సరిదిద్దే బాధ్యతను అప్పగించిందన్నారు. ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర కారాగారంలో సుమారు రెండు వేల మందికి పైగా ఖైదీలున్నారని. వారిలో 82 మంది రౌడీషీటర్లు కూడా ఉన్నారన్నారు. బ్యారక్స్‌లను ప్రతి రోజూ ఉదయం ఆరు గంటలకు అన్‌లాక్, సాయంత్రం ఆరు గంటలకు లాకప్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఉదయం వార్డర్ తాళాలు తీయాల్సి ఉండగా ఆ పనిని ఖైదీలతో చేయించడం చట్టవిరుద్ధమన్నారు. దీనిని సూపరింటెండెంట్ ప్రశ్నిస్తే అది ఇక్కడ మామూలే అని సమాధానమివ్వడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. జైలులో సమస్యలను నివారించేందుకు సుమారు 200 మంది ఖైదీలను రాజమంహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్టు డీఐజీ వివరించారు.

నగరంలో పేకాట డెన్‌లు!

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ద్వారకానగర్, నరసింహనగర్, అక్కయ్యపాలెం, సీతమ్మధార, ఎంవీపీకాలనీ, సాగర్‌నగర్, రుషికొండ, శివాజీపాలెం, రేసపువానిపాలెం, రామాటాకీస్ పరిసర ప్రాంతాల్లోని లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లను పేకాట స్థావరాలుగా మారుస్తున్నారు. ఆర్థికంగా స్థితిమంతులు, వ్యాపారులు నిర్వాహకుల పాత్ర పోషిస్తున్నారని సమాచారం. స్నేహితులు, తెలిసినవారి ద్వారా మరికొందరిని పోగేసి, హోటల్ లేదా గెస్ట్‌హస్‌లో గదిని బుక్‌చేస్తున్నారు. ఫోన్‌లోనే సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. రోజూ ఒకేచోట కాకుండా తరచూ వేదికలు మారుస్తున్నారని తెలిసింది.

సకల సదుపాయాలు

పేకాట రాయుళ్లకు భోజనం, స్నాక్స్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పిస్తుండడంతో ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నట్టు తెలిసింది. అంతేకాదు డబ్బు అవసరమైన వారికి అక్కడే బంగారం తాకట్టుపెట్టుకుని అప్పు ఇచ్చే సదుపాయం అందుబాటులో ఉంచడం విశేషం. పేకాట ఆడేందుకు గది అద్దెతోపాటు ఆహారం, స్నాక్స్ ఖర్చుల కోసం ప్రతీ ఆటలోనూ కొంతమొత్తాన్ని నిర్వాహకుడే మినహాయించుకుంటున్నారని చెబుతున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ ఎంవీపీ పోలీసులు శివాజీపార్క్ ఎదురుగా ఉన్న హోటల్ ఎంవీవీలో పేకాట గుట్టు రట్టు చేశారు. ద్వారకానగర్‌లోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నవారిని పట్టుకున్నారు. నగరంలోని సగానికి పైగా హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల్లో నిత్యం పేకాట జరుగుతోందని పోలీసులకు తెలుసని, అయినా చర్యలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాజాగా న్యూఇయర్, సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట సంస్కృతి విస్తరిస్తోంది. 15-20 రోజులుగా మరింత పెరిగిందని పోలీసు సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు. పేకాటలో డబ్బు పోగొట్టుకున్న కొంతమంది ఇళ్లలో గొడవలు జరిగి పోలీసులను ఆశ్రయిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సీపీ శంఖబ్రతబాగ్చి పేకాట సంస్కృతిని అడ్డుకునే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీరంలో సందడి

» కొనసాగుతున్న నేవీ రిహార్సల్స్

తూర్పు నౌకా దళం ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం రిహార్సల్ కొనసాగాయి. సాయంత్రం 4.30 నుంచి ఆరు గంటల వరకు విన్యాసాలు అబ్బురపరిచాయి. జనవరి 4న జరిగే సాహస విన్యాసాల ప్రదర్శనలో భాగంగా ఆదివారం రిహార్సల్స్ యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. సాగరతీరం బాంబు పేలుళ్లతో మోతక్కిపోయింది. ఆకాశం నుంచి స్కైడైవర విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. యుద్ధ విమనాలు, హెలికాప్టర్లు, నిఘా విమానాలు, యుద్ధనౌకలు, సబ్‌మెరైన్ల సహాయంతో నేవీ సిబ్బంది ప్రత్యర్థులతో పోరాడే తీరును కళ్లకు కట్టినట్టుగా ఆవిష్కరించారు. శత్రు స్థావరాలపై దాడి, సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడం, హెలికాప్టర్లతో అత్యవసర పరిస్థితుల్లో రోప్ సహాయంతో కిందకు దిగడం ఆకట్టుకున్నాయి. నేవీ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో పాటు వేలాదిగా సందర్శకులు విన్యాసాలను తిలకించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


కవాతు చేస్తున్న సముద్ర యోధులు


శత్రు మూకలపై దాడులు చేస్తున్న మెరైన్ కమెండోలు


ఆపదలో ఉన్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్


శత్రువులపై దాడులు చేస్తున్న కమెండోలు, తిలకిస్తున్న సందర్శకులు


వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన యుద్ధ నౌకలు


యుద్ధ విమానాలతో ప్రదర్శన

వేడుకలకు అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ఈవెంట్‌ల నిర్వహణకు అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జీవీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి వై. హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభద్రతచట్టం ప్రకారం జనసమీకరణ జరిగేలా చేసే ఈవెంట్లకు అగ్నిమాపకశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు. నూతన సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికేందుకు ఏటా డిసెంబరు 31 రాత్రి నగరంలోని పలు హోటళ్లు, క్లబ్‌ల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి అన్నారు. వేడుకలు జరిగే ప్రాంతంలో అగ్నిప్రమాదం సంబవించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పొరపాటున అగ్నిప్రమాదం వంటిది సంబవిస్తే ఆ కార్యక్రమానికి హాజరైన వారంతా సురక్షితంగా బయటపడేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. నగరంలో ఇంతవరకూ ఎవరూ తమశాఖ నుంచి అనుమతి తీసుకోలే దని, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశాలు మేరకు వేడుకలు జరిగే హోటళ్లు, క్లబ్‌ల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వేడుకలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 7 వేల మంది సందర్శించారు. వీరి నుంచి సుమారు రూ.6 లక్షల ఆదాయం సమకూరినట్లు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సెలవులు కావడంతో తల్లిదండ్రులతో కలిసి వచ్చారని ఆమె పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీర దోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

జైలులో నిషిద్ధ వస్తువులు ఉంటే చర్యలు : సీపీ


మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైలు సిబ్బంది, ఖైదీల వద్ద నిషిద్ధ వస్తువులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌తో కలిసి ఆదివారం ఆయన కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు తప్పనిసరిగా జైలు నిబంధనలు పాటించాలని, గంజాయి, బీడీలు, మొబైల్ ఫోన్లు వంటివి వినియోగించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. రౌడీషీటర్లుగా ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనతో విడుదలైతే నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జైళ్ల ఉన్నతాధికారి (కోస్తాంధ్ర) ఎంఆర్ రవికిరణ్ మాట్లాడుతూ ఖైదీలు కుటుంబాలతో మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


షాపింగ్ మాల్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

సిరిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం సందర్శించారు. ఆయనకు సీఎంఆర్ షాపింగ్ మాల్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ ఘనస్వాగతం పలికారు. తదుపరి కేంద్ర మంత్రితో కలిసి షాపింగ్‌మాల్‌లో అన్ని విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో కోటి రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అన్ని రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలుత ఎంపీ ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బోర ధన రెడ్డి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, కాళ్ల శంకర్, ఎర్రాజీ రెడ్డి, కర్రి గౌరీ, వరలక్ష్మి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మహిళల పట్టుదలను ప్రతిబింబిస్తున్న డ్వాక్రా మేళా


చీర కొనుగోలు చేస్తున్న ప్రణవ్‌గోపాల్

ఎం.వి.పి.కాలనీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రతిభ, వారి పట్టుదల మేళాలో కనిపిస్తోందని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని డ్వాక్రా మేళాను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కృషి అభినందనీయమన్నారు. ఈ మేళాలో వారి కష్టానికి తగిన గుర్తింపు లభించినట్లుగా ఉందన్నారు. మహిళలు నిర్వహిస్తున్న స్టాళ్లలో హస్తకళా ఉత్పత్తులు, రుచికరమైన ఆహార వస్తువులు ఆకర్షిస్తున్నాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం, మద్దతు ఉంటుందని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ కూడా డ్వాక్రా మేళాను సందర్శించారు. స్టాల్స్‌లోని మహిళలతో మాట్లాడారు. ఆయా ఉత్పత్తులకు సంబంధించిన వివరాలు, వ్యాపార తీరు తెన్నులను పొదుపు సంఘాల సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఓ కౌంటరు వద్ద తన తల్లి కోసం ఒక చీర కొనుగోలు చేశారు. ఆయనతో పాటు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి ఉన్నారు.

నేడు కూడా మేళా కొనసాగింపు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కాలేజీ మైదానంలో ప్రారంభమైన డ్వాక్రా మేళా సోమవారం కూడా కొనసాగనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మేళాను ఈనెల 25 నుంచి 29 వరకు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించామని, కానీ ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో సోమవారం కూడా కొనసాగించాలని నిర్ణయించామన్నారు. మేళాను ఇప్పటివరకు 67 వేల మంది సందర్శించారని, రూ.70 లక్షల విక్రయాలు జరిగాయని తెలిపారు.

జూలైలో సౌత్ జోన్ అనెస్థీషియా సదస్సు


సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

రామ్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఈఏడాది జూలై 3 నుంచి 6 వరకు సౌత్ జోన్ అనెస్థీషియా సదస్సు నిర్వహించనున్నట్టు ఇండియన్ సొసైటీ ఆఫ్ అనెస్థీషియా సౌత్ జోన్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ జి. రాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లోని ఒక హోటల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అనెస్థీషియా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది అనెస్థీషియా వైద్యులు హాజరుకానున్నారని చెప్పారు. అనంతరం సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైద్యులు ఠాగూర్, చక్రవర్తి, కామేశ్వరరావు, కుచేలు బాబు, వి. రవి, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ కృషీవలులకు పురస్కారాలు

సీతంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్న వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో తటవర్తి భారతి స్మారక సాహితీ సభ, పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, విశిష్ట అతిథిగా నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వీవీ రమణమూర్తి, ప్రముఖ రచయిత కృపాకర్ పోతుల హాజరయ్యారు. కథ, కథనం, కథా పఠనం, రికార్డింగ్‌లో మెలకువలు, విమర్శ సమీక్ష, ఇష్టాగోష్టి, చర్చ, ముఖాముఖి వంటి కార్యక్రమాలు తెలుసుకోవడం గొప్ప విషయమన్నారు. సాహితీ సభ అధ్యక్షుడు తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి సభ నిర్వహించగా, వర్రే నాంచారయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం దాట్ల దేవదానం రాజు, ఈతకోట సుబ్బారావు, డా.ఎం.సుగుణరావు, ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ, డా.డి.వి.సూర్యారావు, రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు, ఇందూ రమణ, గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు, తటవర్తి శంకరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డిలకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు.


భువన విజయం నాటక ప్రదర్శనలో సన్నివేశం

అలరించిన భువన విజయం నాటకం

మద్దిలపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భువన విజయం నాటక ప్రదర్శన వైభవంగా సాగింది. 1959 నాటి విజయనగర సామ్రాజ్య పాలనను గుర్తు చేసింది. దేవరాయులు ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు ధూర్జటి, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, వేములవాడ భీమకవి, తెనాలి రామకృష్ణుడు పాత్రధారులు సభలో పద్యాలు, కవితల్లో పోటీ పడి భువన విజయ వైభవాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. కవులు వినిపించిన పద్యాల చిక్కులను దేవరాయులు విప్పుతూ ప్రేక్షకులను మైమరిపించారు. దండం దశ గుణం భవేత్ పద్యానికి.. దండం అంటే కర్ర పది విధాలుగా పనికి వస్తుందని చక్కని వివరణ ఇచ్చారు. కవులు పద్యాల్లో ఒకరికొకరు చమత్కారాలు విప్పుతూ సభను రక్తి కట్టించారు. విజయనగరానికి చెందిన కట్టమూరి చంద్రశేఖర్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాభారతి నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్. రాజు, జి. రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి క్రీడల్లో శిక్షణ


విజేతలకు బహుమతి అందిస్తున్న చిట్టూరి వాసు ప్రకాశ్, తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని శ్రీప్రకాష్ విద్యా నికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాశ్ అన్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్, శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో టీపీటీ కాలనీలోని ఆ విద్యా సంస్థ ఆవరణలో శని, ఆదివారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడల్లో శిక్షణ పొందాలన్నారు. కాగా ఈ పోటీల్లో నగరానికి చెందిన ప్రతిభా విద్యాలయం ప్రథమ స్థానంలో నిలవగా శ్రీప్రకాష్‌విద్యా సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు టీఎస్ఆర్.ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మొహంతి, వైస్ ప్రెసిడెంట్ హనుమంతురావు, కార్యదర్శి భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

పెదవాల్తేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈస్టుపాయింట్ కాలనీలోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో 1985-1990 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం శివాజీ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఆట పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పావని, కార్యదర్శిగా సుభద్ర, కోశాధికారిగా జ్యోతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంగనాథ్ అచార్యులు, టి. సత్యనారాయణరాజు, ఎన్. శ్రీధర్, సీతారామ్, ఎస్. దాసు, ఆర్. శ్రీను, ఖాసీమ్, జె. శ్రీను, కె. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అప్పన్న అలంకరణ అపురూపం : ఎమ్మెల్యే గంటా


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

వెంకోజీపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే వరాహ నరసింహ అవతరాల కలయిక సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రత్యేకత అని, సింహాద్రినాథుడు అత్యంత మహిమాన్వితులని భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో రూపొందించిన అప్పన్న అలంకరణలతో కూడిన 2025 నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే గంటా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే పలు ఉత్సవాల్లో అప్పన్న స్వామికి చేసే అలంకరణలతో ప్రత్యేకంగా క్యాలెండర్ రూపొందించి భక్తులకు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి, పుష్కర గణేష్, డాక్‌యార్డు కేటీబీ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, కాపు సామాజిక వర్గం నాయకులు తోట దుర్గారావు, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేస్తేనే అభివృద్ధి


ఉపేంద్రను సత్కరిస్తున్న బాలభాను అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా పని చేస్తే అభివృద్ధి సాధ్యమని యువ హీరో కంచెర్ల ఉపేంద్ర అన్నారు. ఆదివారం కంబాల కొండ పార్కులో బాలభాను అర్చక పురోహిత సంఘం వారు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి అర్చకులు, పురోహితులు ఏకతాటిపై నడవాలని సూచించారు. వీరి సంక్షేమం కోసం ఉపకార స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందన్నారు. సినిమాల్లో నటించాలనే ఉత్సాహం ఉన్న యువత తమ సంస్థను సంప్రదించాలని కోరారు. అనంతరం హీరో ఉపేంద్రను సంఘ ప్రతినిధులు వేదమంత్రాల ఆశీర్వచనంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలభాను అర్చక, పురోహిత సంఘం వ్యవస్థాపకుడు పంతులు వెంకటరమణ, అధ్యక్షుడు జె.కామేశ్వర శర్మ, మావుడూరు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఎం.వి.పి.కాలనీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు భద్రం పార్కులో రుషిపీఠం సత్సంగం ఆధ్వర్యంలో జరుగుతున్న వేంకటేశ్వర వైభవం ఉదయాస్తమాన సేవా ఉత్సవాల్లో ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం పుష్ప యాగం, చైతన్య సోదరులతో అన్నమయ్య కీర్తనలు, పూరుగంటి రత్నమాల ఆధ్వర్యంలో 108 మంది మహిళలతో అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు. సంకీర్తనలు సభాసదులను అలరించాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామిని వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ దర్శించుకున్నారు. నిర్వాహకులను ఆయన అభినందించారు.

క్రికెటర్ నితీశ్‌రెడ్డికి అభినందనలు

సిరిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాపై విశాఖకు చెందిన నితీశ్‌రెడ్డి తొలిమ్యాచ్‌లో తొలి సెంచరీ సాధించడం అద్భుతమని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ కొనియాడారు. ఆస్ట్రేలియా గడ్డపై అతి పిన్న వయసులో సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డు సాధించడం సంతోషకరమైన విషయమన్నారు. నితీశ్‌రెడ్డి ఆటతీరుపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా గర్విస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ప్రదర్శనలతో భారత జట్టుకు విజయాలు చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలియజేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.